
కథ



# సుఖం-దుఃఖం

'వియోగి'

"సుఖస్వరూపుడు, ఆనందస్వభావుడు అయిన జీవికి దుఃఖం ఎక్కడ నుంచి వస్తున్నది?" పురాణం చెబుతున్న శాస్త్రులు గారి ప్రశ్న.

"స్వామీ! మానవుడు సుఖస్వరూపుడు అని ఎలా చెప్పగలరు? ఆనందస్వభావుడు అని ఎలా చెప్పగలరు?" చిదానందానికి సందేహం కలిగింది. అతను సందేహనివృత్తి కోసం లేచి, స్వామిని అడిగాడు.

శాస్త్రులుగారు చిన్నగా నవ్వారు. అందరి వంకా కలయచూశారు. "నిద్రలో నీ స్వభావం ఏమిటి? గాఢనిద్ర పోయిన తరువాత నీ అనుభవం ఏమిటి? ఎవరైనా సరే, హాయిగా నిద్రపోయామంటారు. రాజు గాని, పేద గాని, ఎవరికైనా సరే, గాఢనిద్రలో కలిగే అనుభవం ఒకటే, ఆనందం! నిద్రలో నువ్వెవరు అంటే చెప్పగలవా? నువ్వు రాజువా, సేవకుడివా, భర్తవా-భార్యవా అన్న భేదభావం కనిపిస్తుందా గాఢనిద్రలో? కనపడదు. అక్కడ అనుభవించేదంతా ఆనందమే! ఆలోచించండి..." ఆగారు శాస్త్రులుగారు.

చాలా మంది అర్థం చేసుకుని తలలు ఊపారు.

"ఆనందస్వభావం మనది అని ఎలా చెబుతారు?" చిదానందం.

"ఎవరైనా సరే, దుఃఖాలు కావాలని కోరుకుంటున్నారా? పుట్టిన శిశువు దగ్గర నుండి మరణించే వృద్ధుడి దాకా సుఖం పొందాలనే తాపత్రయం చెందుతూ ఉంటారు. అందరూ అర్రులు చాచేది సుఖం కోసమే. ఆ సుఖం ఎక్కడున్నది అన్నది వేరే ప్రశ్న-ప్రతి మనిషికీ సుఖంలో తేడా వస్తూవుంటుంది. కాని అతని కోరిక సుఖం కావాలనడంలో మటుకు సందేహం ఉండదు. అందుకని అతని స్వభావం సుఖం" వివరించారు శాస్త్రులుగారు.

"మరి ఎందుకు మనం ఏడుస్తున్నాం? ప్రతి చిన్నదానికీ దుఃఖం ఎందుకు పొందుతున్నాం?" చిదానందం బుర్ర గోక్కుంటూ అడిగాడు.

"మీ అనుమానమే నా సందేహం కూడా. దార్న పోయే మారమ్మను పిలిచి మరీ తల మీద కెత్తుకుంటున్నాం. దుఃఖం బజారులో పోతూ ఉంటే వెంటపడి మరీ మన భుజాల మీదకి ఎక్కించుకుంటున్నాం. ఒక్కటి గుర్తుంచుకోండి. జీవితంలో అంతగా దుఃఖించవలసిన విషయాలు ఏవీ లేవు. మనం ఏం తీసుకువచ్చాం, మన వెంట ఏం తీసుకుపోతాం అని కనుక ఆలోచిస్తే, ఎవరికీ దుఃఖం రాదు."

పురాణప్రవచనం అయ్యేసరికి రాత్రి పది దాటింది. చిదానందం ఆనందంగా ఇల్లు చేరుకున్నాడు. శాస్త్రులు గారు ఇచ్చిన ఉపన్యాసం అతనిలోని నిరుత్సాహానికి పోగొట్టింది. ఇంక ఎప్పుడూ ఆనందంగా జీవించాలనుకున్నాడు. మాయకు లోబడకూడదనుకొన్నాడు.

"ఏమండీ చిదానందంగారూ, మీ పాటికి మీరు ఊళ్లు పట్టుకు ఊరేగండి, నేను ఏ గంగలోనన్నా దూకి చావాల్సివస్తుంది!" కస్సుమని లేచింది, అతని భార్య శారద.

"ఇప్పుడు నీకంత కష్టమేమొచ్చిందే?" ఆశ్చర్యంగా అడిగాడు చిదానందం.

"అస్సలు ఇంటి గురించి మీకేమన్నా పట్టిందా? మీరు ఒక భర్తలాగా-ఒక బాధ్యత గల తండ్రిలా ప్రవర్తిస్తున్నారా?" నిలదీసింది శారద.

చిదానందం బుర్ర గోక్కున్నాడు. 'బాధ్యత' అంటే అర్థం కాలేదు. "సరే, ఉపోద్ఘాతం వద్దులే, విషయంలోకి రా!" విసుగ్గా అన్నాడు.

"లోపలికి రండి-చెబుతా" శారద అతన్ని వంటింట్లోకి తీసుకుపోయింది. తలుపులు మూసింది.

"శారదా, ఇప్పుడేంటి తలుపులు మూస్తున్నావు? అక్కడ అమ్మాయీ, అబ్బాయీ, చదువుకుంటున్నారు..." చిదానందం ఆశ్చర్యంగా అడిగాడు.

"అందుకే-వాళ్లకు మన మాటలు వినిపించకూడదని!" చెప్పింది.

"అంత రహస్యాలు ఏమున్నాయి మన మధ్య?"

"మీ అమ్మాయి ప్రవల్లిక ప్రేమలో పడింది, తెలుసా?"

"ఆ! ప్రేమా? దాని మొహానికి ప్రేమ కావల్సివచ్చిందా? ఇంకా చదువు కూడా పూర్తి కాలేదు. బిటెక్కు ఇంకా సంవత్సరం ఉంది కదా?" చిదానందం విస్తుపోయాడు.

ప్రవల్లిక అతని కూతురు-చాలా అందంగా ఉంటుంది. సన్నగా, పొడు గ్గా-ఆకర్షణీయంగా చక్కటి కంఠ స్వరంతో అందరినీ ఇట్టే ఆకట్టుకుం టుంది.

అది నీ తప్పు కాదమ్మా, నీ వయసు తప్పు. వయసు వాడి అలా ఉంటుంది. ఈ వయసులో ఏ మొగాడు కనిపించినా మన్మథుడిలా అనిపిస్తాడు. కాస్త ఒడ్డు-పొడుగు-ఉండి-నాలుగు మాటలు స్టయిల్‌గా మాట్లాడంగానే ఆడవాళ్లు మనసు పారేసుకుంటారు. కాని ఈ ప్రేమలు, దోమలు నమ్మొద్దు, మగాడు తుమ్మెద లాంటివాడు. మధువు కోసం పువ్వు మీద వాలతాడు. మధువు ఆఘ్రాణించి తుమ్మెద వేరే పువ్వును వెతుక్కుంటూ వెళ్లినట్లు, ప్రేమ ముసుగులో పబ్బం గడుపుకుంటున్నాడు.

"అంటే చదువు పూర్తయినతర్వాత ప్రేమలో పడచ్చనా మీ ఉద్దేశ్యం? మనది సంప్రదాయకుటుంబం. ఇట్లా ప్రేమలు-గీమలు అంటూ ఉంటే దాన్ని ఎవరు పెళ్లి చేసుకుంటారండి? ఆడ పిల్లకు ఒక్కసారి చెడ్డపేరు వచ్చిం దంటే, మనలో ఎవరూ పెళ్లి చేసుకో డానికి ముందుకు రారు" గుర్తుచేసింది శారద.

"కరెక్టేనే! మన వాళ్లంతా ఛాందసపు వెధవలు! అన్నీ బావుంటేనే సంబంధాలు కుదరడం కష్టంగా ఉంది. మళ్లీ క్యారెక్టర్ మీద మచ్చ పడిందంటే ఇంక ఎవరూ చూడ్డానికి కూడా రారు!" చిదానందం దిగులుపడ్డాడు.

"ఇంతకీ అది ఎవరిని ప్రేమిస్తున్నదో తెలుసా? మన కులంవాణ్ని కాదు ఎవరో రెడ్డినిట! అవ్వ! మనం బ్రాహ్మలం పోయి పోయి నాన్ వెజ్ రెడ్డిని ప్రేమించడమేంటి? మన కులంలో మన శాఖవాణ్ని కాకుండా-ఇతరశాఖల వాణ్ని చేసుకోవాలంటేనే బ్రహ్మప్రళయం అవు తున్నది. అటువంటిది ఏకంగా కులం, గోత్రం లేనివాణ్ని ప్రేమించే స్తున్నది...!" శారద చెబుతున్నది.

చిదానందం మెదడు మొద్దుబారుతున్నది. కోపం నసాళానికి అంటు తున్నది. ఆనందస్వరూపుడు కాస్తా విషాదస్వరూపుడూ, క్రోధస్వరూ పుడుగా మారిపోయాడు.

"ఏదీ? దాన్ని చంపేస్తాను!" చిదానందం ఆవేశంగా చిందులేశాడు.

"అయ్యో, మీకేది చెప్పినా ఒకటే ఆవేశం! కాస్త ఆలోచించండి. అది ఆవేశంలో ఏం చేసినా మనకే చెడ్డపేరు. కాస్త మంచిగా చెప్పాలి. మీ మాట వినకుండా ఇంట్లోంచి పారిపోయి వాణ్ని చేసుకున్నా, మనకి మాయని మచ్చ తెస్తుంది. ఆత్మహత్య చేసుకున్నా మనకే తలవం పులు-కొంచెం టాక్టుఫుల్‌గా మాట్లాడాలి..." శారద మళ్లీ హితబోధ చేయసాగింది.

చిదానందానికి ఆ ఆలోచనలతో భోజనం సయించలేదు. నిద్ర కూడా సరిగా పట్టలేదు.

మరునాడు ఆదివారం. ప్రవల్లిక కాలేజీకి వెళ్లనక్కరలేదు.

"అమ్మా! నేను క్లాసుకు వెళ్లి వస్తాను" అని బయలుదేరింది స్కూటర్ మీద, ప్రవల్లిక.

"ప్రవల్లికా-కాస్త ఆగు-నీతో మాట్లాడాలి!" చిదానందం చెప్పాడు.

"ఏంటి నాన్నా?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ పది నిమిషాలు టైమిస్తే మాట్లాడతాను. మేడ మీదకి పోదాం రా!" చిదానందం మేడ మీదికి వచ్చాడు.

మేడ మీద రెండు గదులున్నాయి. అవి ఎక్కువగా వాడరు. గెస్టులు వచ్చినప్పుడు వాడతారు.

ప్రవల్లిక ఆశ్చర్యపడుతూ పైకి వచ్చింది.

చిదానందం ఓ కుర్చీలో కూర్చున్నాడు. ప్రవల్లిక అతని ఎదురుగా కూర్చుంది.

"చూడు తల్లీ, ఈ మధ్య నీ ప్రవర్తనలో ఏదో మార్పు కనిపిస్తున్నది!"

"నా ప్రవర్తనలోనా!?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఆ! ఏదో పరధ్యానంలో ఉంటున్నావు. సరిగ్గా నిద్ర పోవటం లేదు. పుస్తకం ముందేసుకున్నా ఎక్కడో ఆలోచిస్తున్నావు" చిదానందం చెప్పాడు.

"ఏం లేదు నాన్నా! బాగానే ఉన్నాను" ప్రవల్లిక చెప్పింది.

"కొంపదీసి ప్రేమలో కాని పడ్డావా?"

"ఛీ! ఛీ! నన్నెందుకు అలా అనుకుంటున్నారు?" సిగ్గుగా అడిగింది.

"అది నీ తప్పు కాదమ్మా, నీ వయసు తప్పు. వయసు వాడి అలా ఉంటుంది. ఈ వయసులో ఏ మొగాడు కనిపించినా మన్మథుడిలా అనిపిస్తాడు. కాస్త ఒడ్డు-పొడుగు-ఉండి-నాలుగు మాటలు స్టయిల్‌గా మాట్లాడంగానే ఆడవాళ్లు మనసు పారేసుకుంటారు. కాని ఈ ప్రేమలు, దోమలు నమ్మొద్దు, మగాడు తుమ్మెద లాంటివాడు. మధువు కోసం పువ్వు మీద వాలతాడు. మధువు ఆఘ్రాణించి తుమ్మెద వేరే పువ్వును వెతుక్కుంటూ వెళ్లినట్లు, ప్రేమ ముసుగులో పబ్బం గడుపుకుంటున్నాడు. తీరా పెళ్లి అనేసరికి కులం-గోత్రాలు- కట్నాలు గుర్తుకొస్తాయి. మగాడు చపలచిత్తుడు. ఆడది ప్రేమించి నంత గాఢంగా ప్రేమించలేడు. అవకాశవాది. అందులో ఈ కాలేజీ ప్రేమలు అస్సలు నమ్మదానికి లేదు. బరువుబాధ్యతలు లేని వయసు. అందమైన అనుభవం కోసం అర్రులు చాస్తూ ఉంటాడు. కాని ప్రకృతి స్త్రీ పట్ల శత్రువు అవుతుంది. ఆ నాటి శకుంతల నుండి ఈ కాలం ఆధునికస్త్రీ దాకా మొగాడి మాయమాటల్లో పడి మోసపోతూనే ఉంది. జాగ్రత్త!" చిదానందం చిన్న ఉపన్యాసం ఇచ్చాడు చిన్నగా.

"కాని నాన్నా, నా కివన్నీ ఎందుకు చెబుతున్నారు? నేను మీ కూతుర్ని!" ప్రవల్లిక ఆశ్చర్యంగా అడిగింది.

"అందుకే కదమ్మా నా బాధ! ఆకు వచ్చి ముల్లు మీద పడ్డా-ముల్లు వచ్చి ఆకు మీద పడ్డా ఆకుకే నష్టం! పెళ్లి కాని పిల్లవు, నువ్వు ఒక్క పొరపాటు అడుగు వేసినా మా పరువు పోతుంది. మాకు ఆత్మహత్య తప్పించి వేరే గతి లేదు. ఆలోచించుకో. నా ప్రాణం, మీ అమ్మ ప్రాణం నీ చేతిలో ఉన్నాయి. మా ఆశలన్నీ నీపైనే. నీ తమ్ముడి భవిష్య త్తు కూడా దెబ్బ తింటుంది!" చిదానందం ముగించాడు.

ప్రవల్లిక మొహం బాగా నల్లబడిపోయింది. చివాల్న లేచి కిందకు వెళ్లిపోయింది. బండి స్టార్టయి వెళ్లిపోయిన శబ్దం అయింది.

చిదానందం తృప్తిగా నవ్వుకున్నాడు. తండ్రిగా తన బాధ్యత నెరవేర్చాడు. వార్నింగు ఇవ్వలేదనకుండా తను చెప్పాల్సింది చెప్పా డు, బ్రెయిన్ వాష్ చేశాడు. ఇంక జీవితంలో తప్పటడుగు వెయ్యదు కాక వెయ్యదు!

ఇంకో రోజు శారద, చిదానందానికి ఇంకో కంప్లెయింటు ఇచ్చింది. "మీ సుపుత్రరత్నం సరిగ్గా చదువుకోవడం లేదు. చెడు స్నేహాలు పట్టి చెడిపోతున్నాడు. వాడికి చదువు మీద కంటే క్రికెట్ మీద ధ్యాస ఎక్కువైంది..." అంటూ చాలా సేపు అతనికి తలంటు పోసింది.

చిదానందానికి ప్రసన్నకుమార్ పైన చాలా కోపం వచ్చింది. "ఒరేయ్ ప్రసన్నా! అడ్డగాడిదా! ఇలా రారా!" కోపంతో కేకలేశాడు.



"ఏంటి డాడీ?" వినయంగా వచ్చాడు, క్రికెట్ బ్యాట్ పట్టుకుని.

"ఎక్కడికిరా పోతున్నావు పొద్దున్నే?"

"ఇవ్వాళ గ్రౌండులో మ్యాచ్ ఉంది డాడీ!" ప్రసన్నకుమార్ చెప్పాడు.

"జీవితమంతా క్రికెట్టేనేరా? ఒరేయ్ ఈ ఆటలు కూడు పెడతాయా, గుడ్డనిస్తాయా?" వెక్కిరింతగా అడిగాడు.

"అదేంటి డాడీ? మన క్రికెటర్లు కోట్లు సంపాదించ దం లేదా? నేను కూడా ఒక సచిన్-ఒక లక్ష్మణ్-ఒక ధోనీనే అవుతే, ఇంక డబ్బుకు లోటేముంటుంది?" విస్మయం గా అడిగాడు ప్రసన్నకుర్.



"నిజమే. నువ్వు ఆ స్థాయికి పోతే పరవాలేదు. కాని ఫెయిలయ్యావే అనుకో..."

"ఎందుకనుకోవాలి? నా కృషి నే చేస్తున్నాగా?" అర్థం కాలేదు ప్రసన్నకు.

"కాసేపు అనుకోరా. దేశంలో ఎంతమంది క్రికెట్టు పిచ్చి వాళ్లు లేరు? నూట పదికోట్ల జనాభాలో ఎన్ని లక్షల మంది క్రికెట్ ప్లేయర్లు లేరు? మరి వాళ్లందరికీ నేషనల్ టీమ్‌లో ఛాన్సు దొరుకుతున్నదా? ఆలోచించు!" చిదానందం లాజికల్‌గా అడిగాడు.

ప్రసన్నకుమార్ బిత్తరపోయాడు. బ్యాట్ నేలకేసి కొట్టాడు. "ఆ! ఆ ఛాన్సు కోసమే గదా నేను రోజూ ప్రాక్టీసు చేస్తున్నది!" చెప్పాడు.

"నిజమేరా! మరి చదువు ఎవరు చదువుతారురా? ఇంటర్ అయిపోయింది. మెరిట్‌లో బిటెక్కుల్లో సీటు రాలేదు. లాంగ్ టర్మ్ కోచింగ్‌లో చేరావు. ఈ సారన్నా ఎమ్‌సెట్‌లో ర్యాంకు వచ్చి మంచి కాలేజీలో సీటు వస్తుందా?" అడిగాడు చిదానందం.

"వస్తుందనే అనుకుంటున్నాను కాని డాడీ! ఎప్పుడూ చదివినంత మాత్రాన సీటు వస్తుందనుకోవద్దు. రోజుకు ఇన్ని గంటలని చదువుతున్నా, మిగతా గంటలన్నీ ఆటల మీద పెడుతున్నాను. అయినా మీరన్నట్లు సీటు వచ్చినా, బిటెక్కు చేసినా, మంచి జాబు వస్తుందని మీరు రాసివ్వగలరా? రోజూ ఎంతమందిని చూడ్డం లేదు? సంవత్సరానికి 60-70 వేల మంది బిటెక్కు పూర్తి చేస్తున్నారు, ఆంధ్రులు. వీరిలో క్యాంపస్ సెలక్షన్లు కేవలం కొన్ని వందలమందికే వస్తున్నాయి. కొందరు అమెరికా పోతున్నారు. ఇంకా కొందరు చిన్న చితకా ఉద్యోగాలు చేస్తున్నారు. అత్యధికులు ఉద్యోగాల వేటలో ఉన్నారు. బాగా చదువుకున్నంత మాత్రాన గ్యారంటీగా ఉద్యోగం వస్తుందని నమ్మకం లేదు..." ప్రసన్నకుమార్ రివర్స్ స్వింగ్ వేశాడు.

చిదానందం ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. కాసేపటి తరువాత అన్నాడు, "అందుకని చదవకుండా అడ్డగాడిదలా తిరుగుతానంటావు!"

"అని అనడం లేదు. నా భవిష్యత్తు నాకు తెలుసు. మీరేం నా గురించి వర్రీ అవ్వద్దని చెబుతున్నాను. నా గురించి ఆలోచించి మీరు బీపీ పెంచుకుంటే, అమ్మకూ, మాకూ కష్టం కలుగుతుంది. అప్పుడు మా కాన్సన్‌ట్రేషన్ దెబ్బ తింటుంది" ప్రసన్నకుమార్ తండ్రికి క్లాసు తీసుకున్నాడు.

"అబ్బా! చాలా ఎదిగిపోయావురా!" చిదానందానికి నోట మాట రావడం లేదు.

"డాడీ! నా టీమ్ మేట్లు నా కోసం ఎదురుచూస్తూ ఉంటా రు. నేను వెళ్లాలి. అందులో ఇవ్వాళ నేను సెంచరీ చేసితీరాలి!" ప్రసన్నకుమార్ బై చెప్పేసి బండి మీద వెళ్లిపోయాడు.

ఈ సంభాషణ లోపల నుంచి విని, ప్రవల్లిక నవ్వుకుంది.

"ఏమేవ్! నీ కొడుకు చూడు, ఎంత పెద్దవాడయ్యాడో! వాడికి తండ్రి అన్నా కూడా లెక్క లేకుండా ఉంది. వెధవకి నాలుగు రోజు లు తిండి పెట్టడం మానేస్తే తెలుస్తుంది, జీవితమంటే ఏమిటో. కష్టపడి సంపాదించి తెస్తుంటే బాగా తిని అందరికీ నీతులు చెబుతున్నాడు. ఇది యటొ!" కోపం వచ్చింది చిదానందానికి.

"అబ్బ! మీకు ఏది చెప్పినా కష్టమే. మీరు మీ పని చేసుకోండి!" శారద చెప్పింది, చిదానందంతో.

**000**

ఒక రోజు చిదానందం ఆఫీసులో బిజీగా ఉన్నాడు. ఆఫీసరు అవతారం పిలిచి కొన్ని ఫైల్సు గురించి అడిగాడు. చిదానందం ఓపిగ్గా చెప్పాడు. అవతారానికి అర్థం కాలేదు. మళ్లీ రాసి తీసుకురమ్మన్నాడు.

"ఏం సార్! ఈ ఫైళ్ల గురించి ఇంత ఇదిగా ఆలోచిస్తారు? జగత్ మిథ్య బ్రహ్మ సత్యం. అంతా జగన్నాటకం. దాని గురించి ఇంత తల బద్దలు కావటం ఎందుకు సార్? పైవాడికేం తెలుస్తుంది సార్?" అంటూ కొంత మెట్ట వేదాంతం చెప్పుకొచ్చాడు.

ఆఫీసరు అవతారం తలూపి పంపించేశాడు.

*(ఇంకా వుంది)*